నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 26 జూన్ 2023

సీఐటీయూ ద్వారానే కార్మికులకు న్యాయం

- మంచి వేతన ఒప్పందాలు చేస్తున్న సంఘం సీఐటీయూ
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

నవ తెలంగాణ-అమీన్‌పూర్

సీఐటీయూ ద్వారానే కార్మికులకు న్యాయం జరుగుతోందని, మంచి వేతన ఒప్పందాలు చేస్తున్న సంఘం సీఐటీయూ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. మండల పరిధిలోని పటేల్‌గూడలో గల శివపార్వతి ఫంక్షన్ హాల్‌లో కిర్బి కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు సీఐటీయూ జెండా అండగా ఉంటుందన్నారు. మంచి వేతన ఒప్పందాలు సీఐటీయూ ద్వారానే జరుగుతున్నాయని అన్నారు. ఈ పరిశ్రమలో రెండు వేతన ఒప్పందాలు సాధించామని చెప్పారు, అనేక హక్కులు, సౌకర్యాలు తెచ్చామని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్, సర్వీసు వేటేజ్, కాంటాక్ట్ కార్మికుల పర్మనెంట్, వీడీఏ, ఇతర అనేక విషయాలు సాధించామని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి, జనరల్ సెక్రెటరీ వీఎస్ రాజు, జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ కార్మికులకు సీఐటీయూ ద్వారానే న్యాయం జరుగుతుందని అన్నారు. కార్మికులందరూ సంఘటితంగా ఉండాలని కోరారు, కార్యక్రమంలో తలారి శ్రీనివాస్, మల్లేష్, లకాన్, లక్ష్మణ్,సుధాకర్,



నగప్రసద్, శంకర్, మహేశ్వర్ రెడ్డి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ భూముల్లోని గుడిసెలు పేదల హక్కు



- పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేకపోవడం బాధాకరం
- జూన్ 27 బస్సు యాత్ర ముగింపు వరకు ముఖ్యమంత్రి పేదల ఇండ్ల స్థలాల ప్రకటన చేయాలి
- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య





నవతెలంగాణ-సంగారెడ్డి

'ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే కబ్జా అనడం సరైంది కాదు. అది పేదోడి హక్కు. నేటికీ పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేకపోవడం బాధాకరం' అని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. ఈ నెల 18న మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభించిన రాష్ట్ర బస్సు యాత్ర ఆదివారం సంగారెడ్డికి చేరుకుంది. ఈ సందర్భంగా సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎస్.వీరయ్యతో పాటు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడారు. పేదలు ఇంటి స్థలాలు ఇల్లు లేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఏర్పాటు చేసుకుంటే అధికారులు ఆ భూములను కబ్జా చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోవడం పేదల హక్కు అని అన్నారు. దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బస్సు యాత్ర ముగుస్తుందని, ఆ రోజు నాటికి సీఎం కేసీఆర్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇంటి సౌకర్యం లేదని ఇది సాక్షాత్తు రాష్ట్ర ప్రభుత్వమే గుర్తించిందని తెలిపారు. అందరికీ ఇంటి సౌకర్యం అనేది రాజ్యాంగం నిర్దేశించిన హక్కు అని తెలిపారు. సంవత్సరం క్రితం ఢిల్లీ రాష్ట్ర హైకోర్టు జీవించే హక్కు అంటే గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ఇల్లు కూడా ముఖ్యమేనని తెలిపిందన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం పేరుతో 2022 డిసెంబర్ 31 నాటికి అందరికీ ఇంటి సౌకర్యం దేశమంతా కల్పిస్తామని చెప్పి మోడీ మాట తప్పారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు 5.60 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని చెప్పిందని, ఇచ్చింది మాత్రం 36 వేలే అని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కంటితుడుపు చర్య తప్ప పేదలకు పూర్తిస్థాయిలో ఉపయోగ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో విడుదల చేసిన కనీస వేతనాల జీవో ప్రకారం రోజుకు 178 రూపాయలతో సామాన్యుడు కుటుంబం ఎలా బతుకుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీస వేతనాల జీవోలను సవరించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పేదల పట్ల అమానవీయమైన భాష మాట్లాడుతున్నాడని అని అన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలో 61 కేంద్రాలలో 48 వేల మంది పేదలు ఇల్లు వేసుకొని నివాసముంటున్నారని అన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటుతున్నా నేటికీ ఊరి చివర గుడిసెలు వేసుకుని బతుకుతున్నారని అన్నారు. రైతు సంఘం నాయకుడు జయరాజు మాట్లాడుతూ డబుల్బెడ్రూం ఇండ్ల కోసం అనేక మంది పేదలు దరఖాస్తులు పెట్టుకుని ఇండ్లు రాకా తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. సదాశివపేట పట్టణంలో గతంలో ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వం సర్వే నెం.260లో 120 ఎకరాలు సేకరించిన భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి పొజిషన్ చూపాలన్నారు. ఆత్మకూర్ గ్రామంలో సర్వే నెం. 170లో 7 ఎకరాలలో ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా పొజిషన్ చూపలేదన్నారు. సంగారెడ్డి పట్టణంలో సర్వే నెం. 430, 155, కందిలో 615 సర్వే నెం. లో ఉన్న ప్రభుత్వ భూముల్లో పేదలకు వెంటనే ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. జహీరాబాద్, పటాన్చేరు, నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి ప్రాంతాలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోటా రమేష్ , వెంకట్, రాష్ట్ర నాయకులు జగదీష్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అశోక్, మాణిక్యం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, నర్సింహారెడ్డి, వివిధ ప్రజాసంఘాల నాయకులు యాదగిరి, రమేష్, మహేష్, ప్రవీణ్, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ గద్దలతో కుమ్మక్కైన పాలకులు

నవతెలంగాణ-మెదక్

రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన గుడిసెలు పేదల హక్కు అని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య ఉద్ఘాటించారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ, శిఖం, మిగులు, బంజరాయి, పడావు భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుంటున్నట్లు తెలిపారు. పేదలు గుడిసెలు వేసుకుంటున్న సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీ నేతలు రకరకాల వాదనలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ గద్దలతో పాలకులు కుమ్మక్కైనట్లు తెలిపారు. ప్రభుత్వాలు అణచివేతతో ఉద్యమాన్ని ఆపాలనుకునే భ్రమలో ఉన్నట్లు వివరించారు. నిరుపేదలు ప్రభుత్వ భూముల్లోకి రావడం తప్పు అని కొందరు వాదించడం రాజ్యాంగ విరుద్ధమైందని ఖండించారు. భారత రాజ్యాంగం అందరికీ జీవించే హక్కును కల్పించినట్లు గుర్తు చేశారు. సమాజంలో వ్యవసాయ, రైతు, అసంఘటిత కార్మికుల



సంఖ్య ఎక్కువగా ఉందని, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అలాంటి వారు స్థలం కొనుగోలు చేసి ఇళ్ల నిర్మించుకునే అవకాశాలు లేవని తెలిపారు. 'ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవో ప్రకారం రోజుకు రూ.178, నెలకు రూ.4628 వేతనం ఇస్తామంటున్నారు. ఈ వేతనంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎవరైనా బతుకగలరా?' అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలు పెట్టుబడి దారులకు కొమ్ము కాస్తున్నట్లు ఆరోపించారు. తెలంగాణ వచ్చాక కూడా ఒక్క రంగంలోనూ వేతనాలను పెంచిన పరిస్థితులు లేవని విమర్శించారు. రాష్ట్రంలోని పోరాట కేంద్రాల్లో లక్షకు పైగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారందరికీ 125 గజాల స్థలం కేటాయించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ 18 ప్రారంభమైన ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూపోరాట కేంద్రాలను సందర్శిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం మెదక్ పట్టణంలోని 248/1 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెల వద్దకు బైక్ ర్యాలీగా వెళ్లారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి. మల్లు లక్ష్మి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సిఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టీ.సాగర్, సిఐటియూ జిల్లా కార్యదర్శి బస్వరాజు, కోశాధికారి నరసమ్మ, ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు సర్దార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం పాల్గొన్నారు.

గిట్టుబాటు అవుతుందా

రైతుబజారులో రైతులతో ముచ్చటించిన మంత్రి హరీశ్‌రావు

నవ తెలంగాణ - సిద్దిపేట

'మీకు అనుకున్న గిట్టుబాటు అవుతుందా? రైతుబజారులో సౌలత్‌లు ఎట్లా ఉన్నాయి. ఇంకేమైనా కావాల్నా' అని రైతులతో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ముచ్చటించారు. నిత్యం వేలాది మంది వచ్చిపోయే రైతు బజారును పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రత పాటించని ప్రదేశాన్ని చూపుతూ ఇట్లా అయితే ఎలా అంటూ ఎస్టేట్ అధికారి ప్రభాకర్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పట్టణంలోని రైతుబజారును మంత్రి హరీశ్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ములక్కాయలు విక్రయిస్తున్న మహిళా రైతుతో ముచ్చటిస్తూ గిట్టుబాటు అవుతుందా అంటూ ఆరా తీశారు. కిలో 50 రూపాయలు ధర పలుకుతున్నదని రైతు వివరించింది. ఈ ప్రాంతంలో నీళ్ల బాగానే ఉన్నాయని సంబురంగా చెప్పింది. నేను ఐదేకరాలు ములక్కాయ పంట పెడతానని చెప్పుకొచ్చారు. ఇర్కోడ్ తొక్కులు, మిట్టపల్లి పప్పులు, కారం, పసుపు విక్రయ కేంద్ర నిర్వాహకులు లక్ష్మీతో మంత్రి ముచ్చటించారు. వ్యాపారం ఎలా కొనసాగుతున్నదని ఆరా తీశారు. ఇర్కోడ్ తొక్కులు, మిట్టపల్లి పప్పులు హైదరాబాదు మార్కెట్లో సైతం ఎగుమతి చేయాలని, ఇందుకు పోలీసు కమిషనర్ శ్వేత కావాల్సిన సహాయ సహకారాలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజిత-వేణుగోపాల్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో



నాయకులు రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం ప్రపంచానికి భరోసా

నవ తెలంగాణ - సిద్దిపేట

కరోనా సమయంలో ప్రపంచానికి ఆయుర్వేదం ఒక్కటే భరోసా ఇచ్చిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. పోలీసు కన్వెన్షన్ హాల్‌లో విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆయూష్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరంగపాణి, సమన్వయ కర్త శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి కిషన్ రెడ్డి



ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యులకు హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లలో సేవలు అందించే ఒక గొప్ప అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. 1154 మందికి ఎంఎల్ హెచ్ పీగా అవకాశం కల్పించామని, మొత్తం 3071 మందిలో మీరు మూడో వంతు ఉన్నారని అన్నారు. 1987లో డెయిలీ వేజేస్ పై ఆయుర్వేద వైద్యుల భర్తీ జరిగితే, 1999లో, 2006లో, 2011లో భర్తీ జరిగిందని, ఈ నాలుగు సార్లు చేసిన భర్తీ ప్రక్రియ ద్వారా మొత్తంగా 400 మందికి కూడా అవకాశం రాలేదని, కానీ తెలంగాణ ప్రభుత్వం కల్పించిన అవకాశం ద్వారా ఒకేసారి 1154 మందికి అవకాశం కలిగిందని, ఇది వైద్య చరిత్రలో గొప్ప మార్పు అన్నారు. అంతుచిక్కని మహమ్మారికి సంప్రదాయ వైద్యమే మందు అని ఎంతో మంది నమ్మి ఆచరించారని, ప్రాణాలు కాపాడుకున్నారని అన్నారు. కరోనా సెకండ్ వేవ్ లో సోకిన బ్లాక్ ఫంగస్ వ్యాధి ప్రపంచాన్ని భయపెట్టిందని, మందులు కూడా లేని సమయంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయుర్వేద కళాశాల వైద్య బృందం ఎంతో పరిశోధించి బ్లాక్ ఫంగస్ కు మెడిసిన్ ఆవిష్కరించిందని, బ్లాక్ ఫంగస్ కు ఔషధం కనుగొనడం తెలంగాణలో జరగటం మనందరికి గర్వకారణమన్నారు. వికారాబాద్, భూపాలపల్లి, సిద్దిపేటలో 50 పడకల కొత్త ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. సిద్దిపేట మెడికల్ ఆసుపత్రికి ఆయుర్వేద అనుసంధానం చేస్తామన్నారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

ఆధునిక కాలంలో బాణామతి దాడులు అమానుషం

కొల్కూర్‌లో బాధితులను పరామర్శించిన ప్రజా సంఘాలు



నవ తెలంగాణ -సదాశివపేట


ఆధునిక కాలంలో మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడులు చేయడం అమానుషమని స్వేచ్ఛ జేఏసీ, మానవ హక్కుల వేదిక, దళిత బహుజన ఫ్రంట్, భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్, పీడీఎస్‌యూ ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆదివారం ప్రజా సంఘాల బృందం కొల్కూర్‌లో బాణామతి దాడికి గురైన యాదయ్య, అమృతమ్మ కుటుంబాన్ని, సదాశివపేట సీఐ నవీన్‌కుమార్‌ను కలిసి దాడి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ రమేష్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు రోహిత్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సురేష్ మాట్లాడుతూ మంత్రాలు చేస్తున్నారనే నెపంతో చర్చి వద్ద, గ్రామపంచాయతీ వద్ద చెట్టుకు వేలాడదీసి కొట్టి హత్యాయత్నానికి పాల్పడటం సిగ్గు చేటన్నారు. సమాజం అభివృద్ధి చెందుతున్నదని పదేపదే వల్లించే పాలకులు ఇలాంటి సంఘటనలకు ఎలాంటి సమాధానం చెపుతారని ప్రశ్నించారు. మంత్రాలు, బాణామతి పేరుతో దాడులను అరికట్టేందుకు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కళాజాత ద్వారా గ్రామంలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సీఐని కోరారు. సంఘటనలో దళితేతరులు వున్నందున వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిడి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు మహెష్, భారత నాస్తిక సమాజం నాయకుడు స్పార్టకస్,ఎస్.ఎస్.ఎఫ్ నాయకులు వివెక్,మానవ హక్కుల వేదిక నాయకులు సంజీవ్,వివిధ ప్రజా సంఘాల నాయకులు మహేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను మూసేసే కట్రను తిప్పికొడదాం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు

నవతెలంగాణ-నారాయణఖేడ్

'ఐసీడీఎస్‌ను మూసేసే కట్రను తిప్పికొడదాం. సమగ్ర శిశు , స్త్రీ సంక్షేమానికి గండి కొట్టే కుట్రలను అడ్డుకుంటాం. దేశంలో మోడీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల ధ్వంసమయ్యాయి. అంగన్‌వాడీ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై జులై 10న బ్లాక్‌డే.. పాదయాత్ర.. నిరసనలు చేపడతాం' అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి సాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ తొమ్మిదేళ్ల పాలనలో బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, విమానయానం, పోర్టులు, రోడ్లు, మైదానాలు, ఎల్ఐసీ వంటి సంస్థలను ధ్వంసం చేసి కార్పొరేట్ శక్తులకు లాభాలు పోగేసే పని మాత్రమే జరిగిందన్నారు. ఐసీడీఎస్ సంస్థను బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడిచేలా నిధుల్ని తగ్గిస్తోందన్నారు. అంగన్‌వాడీలకు ఎందుకు గ్రాట్యుటీ చెల్లించడంలేదని ప్రశ్నించారు. 2013లో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించి గ్రాట్యుటీ, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయలు కల్పించాలకు సిఫార్సు చేసినా పాలకులు అమలు చేయడం లేదన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పుకునే సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు అంగన్‌వాడీల సమస్యల్ని పరిష్కరించకపోతే బీజేపీకి బీఆర్ఎస్‌కు తేడా ఏముంటదని ప్రశ్నించారు. రాబోయే కాలంలో ఐసీడీఎస్ పరిరక్షణ, జీతభత్యాల కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు సమరశీలంగా ఉద్యమాలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టులకు అయ్యే ఖర్చుల్ని వంద శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిధుల్ని తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేస్తుందన్నారు. నూతన విద్యా విధానం అమల్కైతే ఐసీడీఎస్ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేసిందని



చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టీఎ, డీఎలివ్వడంలేదన్నారు.కర్ణాటకలో గ్రాట్యుటీ ఇస్తుంటే తెలంగాణలో ఎందుకివ్వరన్నారు .కేరళ, బెంగాల్‌లో ఏటా బోనస్ ఇస్తుంటే తెలంగాణలో ఎందుకు అమలుకావడం లేదన్నారు. సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా భయపడేది లేదన్నారు. జులై 10న దేశ్యాప్తంగా కోరికల దినం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నల్లచీరలు, జాకిట్ ధరించి నిరసన ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు చిరంజీవి అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూఉయన్(సీఐటీయూ) ప్రాజెక్ట్ అధ్యక్షురాలు నాగేశ్వరి, శాంతమ్మ అనురాధ, స్వరూప, నిర్మల పూలమ్మ, సత్య, శశికళ, బసంతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కులవ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తేనే అభివృద్ధి



నవతెలంగాణ-టేక్మాల్

భారతదేశంలో కుల వ్యవస్థ సంపూర్ణంగా నిర్మూలనమైనప్పుడే అభివృద్ధి చెందుతుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సంగమేశ్వర్ అన్నారు. ఆదివారం అల్లాదుర్గం మండలం బైరందిబ్బ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. కులాంతర వివాహాలు చేసుకుంటే అగ్రవర్ణాలవారు పరువు హత్యలు చేస్తున్నారన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలంటే, కొంతమంది చేతిలో ఉన్న భూమిని అందరికీ పంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం సంపన్నులను ప్రసన్నం చేసుకోవడం కోసమే అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. పరిశ్రమలు నెలకొల్పకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో యువత పక్కదారి పడుతోందన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వం చేతిలోనే ఉండాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాలు సాధించాలంటే ప్రతి ఒక్కరు విద్య వైద్యరంగంలో ముందుండాల న్నారు. బడుగు బలహీన వర్గాలలో కొనుగోలు శక్తి లేకపోవడంతో తలసరి ఆదాయం పడిపోయి.. ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితులు తలకిందులవుతున్నాయని తెలిపారు. వ్యక్తి కొనుగోలు శక్తి పెరగాలంటే, పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం రెండు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని చెప్పారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఇంకా ఆకలి చావులెందుకన్నారు. అంబేద్కర్ త్యాగ ఫలితమే మన రాజ్యాంగం అని గుర్తు చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. విగ్రహ దాత జంగం రాజస్వామి నడిపుల్ల రవీందర్, కాశి పాక ఇమ్మయ్య నక్క సూర్యకుమార్ మోహన్ ఎర్రవరం దేవదాస్ వెంకట్ సంగయ్య నాందేడ్ దుర్గయ్య నీరుడి దుర్గేష్ ఎర్రోళ్ల పోచయ్య అప్పాజీపల్లి సురేష్ గొర్రెకల్ దాసయ్య బాసన్న గారి బలరాం అందిన మొగులయ్య ప్రవీణ్ సంచుల చింత రమేష్ గుమ్మడి లక్ష్మణ్ లో ఉన్నారు. తలారి బేతయ్య ,పసునూరి రవీందర్, స్వర్ణ అక్, కోర్మోని లక్ష్మయ్య, నీరుడి రాజు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ - పటాన్ చెరు




ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నిబద్ధతతో పని చేస్తూ కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తున్నారని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు పట్టణ పరిధిలోని సయ్యద్ హజ్రత్ మురాద్ అలీషా దర్గాలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, చదర్ సమర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ పటాన్ చెరు డివిజన్ అభివృద్ధికి 10 కోట్ల రూపాయలు మంజూరు చేయడంపై స్థానిక మైనార్టీ నాయకులు, మత పెద్దలు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అల్లా ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, నాయకులు లియాకత్ అలీ, అజ్మత్, ఖాజా, వాజీద్ అలీ, అతీక్, మోయిన్, ఆశం, మైనార్టీ మత పెద్దలు పాల్గొన్నారు.

స్టేడియం సందర్శించిన కేంద్ర మంత్రి

నవతెలంగాణ - మెదక్

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల ఆదివారం మెదక్ నియోజకవర్గంలో పర్యటించారు. మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మెదక్ పట్టణంలోని స్టేడియం సందర్శించి సింథటిక్ ట్రాక్‌ను పరిశీలించారు. స్టేడియంలో ఉన్న సమస్యలను, క్రీడాకారుల అవసరాల గురించి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులతో పాటు క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. తరలించిన స్పోర్ట్స్ అకాడమీని మెదక్ స్టేడియం తీసుకురావాలని మెదక్ జిల్లా స్పోర్ట్స్ ఫౌండేషన్ తరపున వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో ఉన్న బాక్సింగ్, అథ్లెటిక్ అకాడమీని గచ్చిబౌలి స్టేడియంకు తరలించడం జరిగిందని తెలియజేశారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మెదక్ స్టేడియంలో అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తి చేసుకున్నామని, సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు ఏ ఒక్క అకాడమీ కూడా తిరిగి నియమించకపోవడం సరికాదన్నారు. అథ్లెటిక్ అకాడమితో పాటు వెయిట్ లిఫ్టింగ్, ఫుట్ బాల్ అకాడమీని నియమించాలని కోరారు. ఇతర అకాడమీలను సైతం నిర్వహించినట్లయితే వారికి హాస్టల్ వసతి కొరకు కలెక్టర్ ద్వారా 1000 గజాల స్థలాన్ని అతి త్వరలో మంజూరు చేసుకుంటున్నామని విన్నవించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు తాళ్ళపల్లి రాజశేఖర్, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు రామ్చరణ్ యాదవ్, నాయకులు నల్లాల విజయ్, నాయిని ప్రసాద్, మధు, స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జుబేర్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు ఎంఎల్ఎస్ రెడ్డి, శ్రీనివాస్, ఉమ్మర్, శ్రావణ్, శ్రీనివాస్, శ్రీను, శివనాగ్, మోయిజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





మాజీ సర్పంచ్ తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్



మొగుడంపల్లి మండలంలోని మీర్జంపల్లితాండా మాజీ సర్పంచ్ నారాయణ జాదవ్ యొక్క తల్లి మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదివారం మృతురాలి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం నారాయణ జాదవ్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ సీతా బాయ్ గోపాల్, ఇప్పేపల్లి పీఏసీఎస్ చైర్మెన్ దాసరి మచందర్, మాజీ పీఎస్ఎస్ చైర్మెన్ కిషన్ పవర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బంగారు సురేష్, సర్పంచులు ఉమేష్ లాల్, రామ్ శెట్టి, రూప్సింగ్, మాజీ కౌన్సిలర్ మోతిరామ్, ఉపసర్పంచ్ చందర్ పవర్, నాయకులు శివరాం నాయక్, గోపాల్, తేజు నాయక్, హరి సింగ్ రాథోడ్, దేవిదాస్ జాదవ్, లింబాద్ చౌహన్ తదితరులు ఉన్నారు.

సంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-వట్‌పల్లి



ఖాదీరాబాద్ వ్యవసాయ పరపతి సంఘం గౌరెకల్ డైరెక్టర్ సంగారెడ్డి రెండ్రోజుల క్రితం మృతి చెందిన విషయం విధితమే. కాగా అతని కుటుంబాన్ని ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదివారం పరామర్శించారు. సంగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. చురుకైన కార్యకర్త రవీందర్‌రెడ్డి కూడా కరోనా సమయంలో మరణిం చడం చాలా బాధాకరమన్నారు. ఒకే కుటుంబంలో రెండేండ్లలో తండ్రి, కొడుకులు మరణించడం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నదన్నారు. పార్టీ ఎల్లవేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసాని చ్చారు. అంతకుముందు సంగారెడ్డి చిత్రపటానికి పూలమా లలు వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ నాగరాణి బసవరాజ్, సర్పంచ్ నవనీత సుభాష్ గౌడ్, వరం చైర్మెన్ వీరారెడ్డి, మండల రైతు సమావేశం అధ్యక్షులు అశోక్ గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధిరెడ్డి తదితరులున్నారు.

భగ్గుమంటున్న ధరలు

- పెరిగిన కూరగాయల రేట్లతో సామాన్యులు కుదేలు
- సగటున కిలో రూ.60 పైనే
- టమాట కిలో రూ.70కి చేరువ

నవతెలంగాణ-జహీరాబాద్



వర్షాలు ఆలస్యంగా కురవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగియి. టమాట కిలో రూ.70 చేరింది. ప్రతీ కూరగాయ కిలో రూ.60 పైనే పలుకుతున్నది. సామాన్యులపై ఈ ధరాఘాతం తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికి తోడు పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో పప్పుల రేట్లు కూడా ఆకాశాన్నంటు తున్నాయి. కిలో రూ.100 నుంచి 170 వరకు వివిధ రకాల పప్పుల ధరలు ఉన్నాయి. పేదలు కూలి పనులకు వెళ్లి రోజంతా కష్టపడితే రూ.200 నుంచి రూ.350 లోపే వస్తుంది. రోజంతా కష్టప డితే వచ్చిన కూలి డబ్బులతో రెండ్రోజులకు సరిపడా కూరగా యలు కూడా రావట్లేదని వారు వాపోతున్నారు. 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంజి, గట్కతో ఆకలి తీర్చుకున్నది మేలు

ఉపాధి హామీ పనులకు వెళితే రోజుకు రూ.200 నుండి 250 వరకు మాత్రమే కూలి పడుతుంది. ప్రైవేటు పరిశ్రమల్లో పనులకు వెళితే 12 గంటలు విధులు నిర్వహిస్తే రూ.360 నుండి 380 దినసరి కూలీ చెల్లిస్తున్నారు. ఆదివారం విధులకు వెళ్లకుంటే ఆరోజు ఏ పరిశ్రమలో కూడా వేతనాలు ఇవ్వడం లేదని ప్రయివేటు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆకాశాన్నంటుతున్న ధరలను చూసి సామాన్యులు కుదేలు అవుతున్నారు. గంజి, గట్క తిని కడుపునింపుకున్నది మేలని అభిప్రాయప డుతున్నారు. విపరీతంగా పెరిగిన కూరగాయల, నిత్యాసర ధరలను వెంటనే తగ్గించి.. తాము కడుపు నిండా అన్నం తినేలా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో పప్పుల రేట్లూ పైపైకి

కూరగాయల రేట్లు భగ్గుమంటుండడంతో.. కాసింత పప్పు పులుసు అయినా చేసుకుందామంటే అక్కడా ఇదే పరిస్థితి. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో పప్పుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. కంది పప్పు కిలో రూ.115 నుండి 170 పలుకుతున్నది. మినప్పప్పు కిలో రూ.150 నుంచి 170, మినప్పప్పు రూ.140 నుండి 150 పలుకు తున్నది. సామాన్య ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే ఎర్రపప్పు కూడా రూ.100 నుంచి రూ.135 ఉండడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కడుపునిండా అన్నం కూడా తినే దుస్థితి లేదని వాపోతున్నారు. దీనికి తోడు బియ్యం ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. బియ్యం బిపిటి, సోనామసూరి హంస 25 కిలోల సంచిపై రూ.100 నుండి 150 పెరిగింది. సరాసరి క్వింటాకు రూ.500 నుండి 600 వరకు పెరగడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జొన్నలు, సాయి జొన్నలు కిలో రూ.60, పచ్చ జొన్నలు కిలో రూ.80 పలుకుతు న్నాయి. ఈ మధ్య షుగర్ వ్యాధిగ్రస్తులు పచ్చజొన్నలను ఎక్కువగా వాడడంతో వాటి ధర అమాంతంగా పెరిగిపోయింది.

కూరగాయలు	ధర(కిలోకు)
టమాట	రూ.60-70
గోరుచిక్కుడు	రూ.60-80
బీర్నీస్	రూ.120
బెండకాయ	రూ.42-50
కాకరకాయ	రూ.100
బంగాళదుంప	రూ.40
బీట్రూట్	రూ.120
వంకాయ	రూ.60
దొండకాయ	రూ.60
పాలకూర	రూ.80
మెంతెం కూర	రూ.120
కరివేపాకు	రూ.120
పుదీనా	రూ.50(కట్ట)

బియ్యం, పప్పు అక్రమ నిల్వలపై కానరాని విజిలెన్స్ దాడులు?

జిల్లాలోని ప్రముఖ వ్యాపారవేత్తలు పప్పు దినుసులు, బియ్యం రేట్లు పెంచే దిశగా అక్రమ నిల్వలు చేసినట్లు ఆరోపణ లు ఉన్నాయి. గతంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరిగితే ప్రభుత్వం వెంటనే స్పందించి విజిలెన్స్ దాడులు నిర్వహిస్తే బియ్యం, పప్పు దినుసుల ధరలు దిగివచ్చే విషయం తెలిసిందే. అక్రమ నిలువలపై అధికారులు త్వరలో జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

దళారులదే ఇష్టారాజ్యం..

రైతులు నెలల తరబడి కష్టపడి కూరగాయలను సాగు చేసే మార్కెట్‌కు తరలిస్తే మార్కెట్లో ఉన్న దళారులు వారి వద్ద నుంచి గుత్తాగా ఒకేసారి మొత్తం కొనుగోలు చేసి.. తదుపరి చిల్లర వ్యాపారులకు డబుల్ రేట్లకు విక్రయిస్తున్నారు. ఎలాంటి కమిషన్ ఏజెంట్ లైసెన్సులు లేకపోయినప్పటికీ.. తాము కమిషన్ ఏజెంట్లుమని రైతుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్లో తాము నేరుగా విక్రయిం చకుండా వారికే ఇవ్వాలని పట్టుపట్టి తమ వద్ద నుండి సరుకులను లాక్కుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మార్కెటింగ్ శాఖ అధికా రులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. జహీరా బాద్‌లో రైతు బజార్ ఏర్పాటు చేసి రైతులకు నేరుగా కూరగా యలు విక్రయించేందుకు అనుమతులు ఇస్తే కూరగాయల ధరలు తగ్గి వస్తాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూను బలపర్చండి

నవతెలంగాణ-పటాన్‌చెరు

మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల కిర్బి పరిశ్రమలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ, బీఎమ్ఎస్, టీఎన్‌టీయూసీ ఐక్య కూటమి తరపున పోటీ చేస్తున్న కార్మిక శాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డిని గెలిపించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కిర్బి పరిశ్రమ బీఆర్‌టీయూ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ కార్మిక శాఖ మంత్రి పెద్దిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో జరగను న్న కిర్బి పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్‌లు కూటమిగా ఏర్పడి పోటీ చేయనున్నట్లు తెలిపారు. కిర్బీ పరిశ్రమ లాభాల్లో కొనసాగుతున్నప్పటికీ కార్మికుల న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైంద న్నారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పారిశ్రామిక రంగంలో చేపడుతున్న విప్లవత్మక సం స్కరణల మూలంగా అంతర్జాతీయ పరిశ్రమలు తెలంగా ణలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. దీని మూలంగా లక్షలాది ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. రాబోయే కిర్బీ పరిశ్రమ కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఘన విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్, బీఆ ర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, కార్మిక నాయ కులు మాధవరావు (బీఆర్‌టీయూ), శ్రీనివాస్ (బీఎంఎస్), సుదర్శన్(టీఎన్‌టీయూసీ), బుచ్చయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు తరలిన జిల్లా మేదరి సంఘం నాయకులు

నవతెలంగాణ-సంగారెడ్డి



సిద్ధిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ఆత్మీయ సమ్మేళనం, రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మేదరి మహేంద్ర సంఘం నాయకులు తరలి వెళ్లారు. వారిలో మేదరి మహేంద్ర సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంబా దాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, గౌరవ అధ్యక్షులు నంది కంటి నర్సింలు, కోశాధికారి పులి రాజేష్, ప్రచార కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు శ్రీశైలం, సత్యనారాయణ, ఆంజనేయులు, నోముల రమేష్, జొర్రిగల లోకదాస్, పాతకోటి శంకర్, లక్ష్మణ్,బిక్షపతి శ్రీనివాస్,శేఖర్,అనిల్, రాములు, కృష్ణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విరాళాలు అందజేసిన పట్నం మాణిక్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

శ్రీ మహాత బసవేశ్వర జయంతి వేడుకకు రూ.లక్ష, కంది హనుమాన్ మందిరానికి మూడు లక్షల విరాళాన్ని పట్నం మాణిక్యం ఫౌండేషన్ ద్వారా డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం ఆదివారం అందజేశారు. అలాగే కొండాపూర్ మండలంలోని గారెకుర్తి గ్రామంలో శివాజీ విగ్రహానికి రూ.2,50000 విరాళాన్ని అందజేశారు.

ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థులను చేర్పించాలి

నవతెలంగాణ-వట్‌పల్లి



మండలంలోని దేవూనూరు గ్రామంలో గల ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థులను చేర్పించాలని ఆటోకు బ్యానర్‌ను ఏర్పాటు చేసి.. వార్డెన్ నర్సింలు గ్రామ గ్రామాన కర పత్రాలు పంచుతూ వినూత్నంగా ప్రచారం చేస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దేవూనూరు గ్రామంలో గల బాలుర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సుమారు 80 మంది విద్యార్థులకు సరిపోను గదులు, డైనింగ్ రూం, స్టడీ రూమ్‌తో పాటు మరుగు దొడ్లు, తాగునీటి వసతి, క్రీడా మైదానం వంటి సౌకర్యాలు ఉన్నాయి. అయితే సౌకర్యాలకు తగ్గట్టు విద్యార్థులు చేరకపోవడంతో.. ప్రభుత్వ వసతి గృహాల పై ఉన్న అపోహను, అనుమానాలను తొలగించడానికే ఇలా ప్రచారం చేస్తున్నట్టు నర్సింలు తెలిపారు. అన్ని తరగతులలో ఖాళీలు ఉన్నాయని.. వెంటనే సంప్రది ంచి ప్రవేశం పొందాలన్నారు. గత మూడ్రోజులుగా మండలంలోని పలు గ్రామా ల్లో ఎంపీటీసీల పురం అధ్యక్షుడు నర్సింలు మరికొందరితో కలిసి ప్రచారం చేపట్టామని.. దీంతో నూతన విద్యార్థులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ' నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సంగారెడ్డి

'లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ' నూతన అధ్యక్ష కార్యదర్శులుగా లయన్ మంగళపర్తి వెంకటేశం, లాడె మల్లేశం ఎన్నికయ్యారు. లాడె మల్లేశం అధ్యక్షతన పిల్లిగుండ్ల రాములు గౌడ్, శంకరి విజయెందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని సువర్ణ నిలయంలో నిర్వహించిన లయన్స్ జనరల్ బాడీ సమావేశంలో 2023-24 ఏడాదికి సభ్యులందరినీ ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా లయన్ మంగళపర్తి వెంకటేశం, కార్యదర్శిగా లాడెమల్లేశం, కోశాధికారిగా నాయికోటి రామప్ప, ఉపాధ్యక్ష లుగా జూలకంటి ప్రభాకర్, పెద్దోటి శ్రీ నివాస్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా జార్జ్ మాథ్యూస్, మెంబర్షిప్ కమీటి చైర్మెన్ (జిఎస్‌టి)గా పిల్లిగుండ్ల రాములు గౌడ్, సేవాకమీటి (జిఎస్టి)చైర్మెన్‌గా శంకరి విజయెందర్ రెడ్డి,మార్కెటింగ్ చైర్మెన్ (వీఆర్వో)గా రఘుపతి ప్రభాకర్ రెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా అనంతరావ్ కులకర్ణి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా డి.హన్మంత్ గౌడ్, యం.సునీల్ కుమార్, టి.అల్లంరెడ్డి, డా.శ్రీహరి, పి.రాంగోపాల్‌ను కార్యవర్గంగా ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో..



భార్య మృతి, భర్తకు గాయాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

బైక్‌పై వెళ్తున్న దంపతులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో.. భార్య మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్ నగర్ గాజుల రామారానికి చెందిన గంట రాజు, అతని భార్య సక్కుబాయి (38)తో కలిసి బైకుపై శనివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో తిరిగి ఇద్దరు బైకుపై ఇంటికి బయల్దేరారు. మండలంలోని లగ్దారం గేట్ సమీపంలో గల సిగ్నోడ్ పరిశ్రమ ఎదురుగా జాతీయ రహదారిపై వెనకాల నుంచి గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న రాజు పక్కనే ఉన్న చెట్ల పొదల్లో పడిపోగా.. వెనకాల కూర్చున్న సక్కుబాయి ఎగిరి అవతల రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఆమె పైనుంచి పోవడంతో శరీరం నుజ్జు నుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త రాజు ఫిర్యాదు మేరకు ఎస్సై దుర్గయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరుకు బకాయిల కోసం త్వరలోనే ఆందోళన

నవతెలంగాణ-న్యాల్‌కల్



కొత్తూరు (బి) ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం చెరుకు రైతులకు రూ.12 కోట్లు బకాయిలు చెల్లించ కుండా పూర్తి నిర్లక్ష్యం చేస్తుండడంతో.. బాధిత రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారని.. వారికి తమ పార్టీ తరపున ఎల్లవేళలా మద్దతు ఉంటుందని బీజేపీ మండలాధ్యక్షుడు ఏక్‌నాథ్ పాటిల్ అన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన చెరుకు రైతు లకు ప్రతీయేటా చేదు కబురే ఎదురవుతున్నదన్నారు. ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ వెంటనే బిల్లులు చెల్లించకుంటే.. పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. రైతులు గంగ్వార్ జనార్దన్ రెడ్డి, ఓనం రెడ్డి ఉన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళా ఆత్మహత్య



నవతెలంగాణ-ఝరాసంగం

ఆరోగ్యం బాగాలేక మానసికంగా బాధపడుతున్న ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని క్రిష్టాపూర్ గ్రామానికి చెందిన ఇందుర్ మంజుల(40) గత కొంతకాలంగా అనారోగ్యంతో మానసికంగా బాధ పడుతున్నది. దీంతో తరచూ తన భర్తతో గొడవ పడుతూ ఉండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె.. శనివారం సాయంత్రం గ్రామ శివారులో గల పెద్ద బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. బావిలో దూకు తుండగా శబ్దం రావడంతో దారిన వెళ్తున్నా ఓ వ్యక్తి ఆమె భర్తకు సమాచారం అందించాడు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ రూరల్ సిఐ నోముల వెంకటేష్, ఎస్ ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.

తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలకు స్థానం లేదు



నవతెలంగాణ-రామచంద్రాపురం

ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల మూలంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నదని.. ప్రతిపక్ష పార్టీలు డిపాజిట్ల కోసం పోరాడాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మునిసిపల్ పరిధిలోని ఈదుల నాగులపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభు ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు శంషాబాద్ రవి, రాజు, రాములు బిక్షపతి, అర్జున్, బాబు, ప్రభు, తదితరులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్ నాయకత్వంలో ఆదివారం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 9 ఏండ్ల పరిపాలనలో ప్రతి గ్రామం, పట్టణం అభివృద్ధికి ప్రతీకలుగా నిలపడంతో పాటు, ప్రతి పేదవాడి ఆర్థిక అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యం కావాల్సిన ప్రతిపక్షాలు కేవలం దుష్ప్రచారానికి పరిమితమవుతున్నాయని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ విజయ్ కుమార్, 14వ వార్డు అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ విట్టల్, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మహిపాల్‌రెడ్డికి డిపాజిట్ గల్లంతు

నవతెలంగాణ-రామచంద్రాపురం



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్చెరు నియోజవర్గంలో మహిపాల్ రెడ్డి డిపాజిట్ గల్లంతు కావడం తథ్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో స్థానికులకే 50 శాతం కేటాయించాలని కోరుతూ.. ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం ఎదుట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తున్నాయని గతంలో ఇచ్చిన వాగ్దానాలనే పటాన్చెరు సభలో సీఎం కేసీఆర్ మరో మారు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పటాన్చెరు వరకు మెట్రో రైలు, పాలిటెక్నిక్ కాలేజ్ మరియు రాయసముద్రం చెరువు అభివృద్ధి గురించి గతంలోనే ముఖ్యమంత్రి మరియు మంత్రులు వాగ్దానాలు చేసినప్పటికీ.. ఏండ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదని గుర్తు చేశారు. కొల్లూరు డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకు 50 శాతం కేటాయించాలని లేనియెడల కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో రింగ్‌రోడ్, బిహెచ్ఇఎల్, బీడీఎల్ ఓడిఎఫ్ మరియు పెద్ద పెద్ద పరిశ్రమలు రావడానికి కారణం కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ముఖ్యమంత్రి డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి వస్తున్న సందర్భంలో స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్లకు ఆహ్వానం ఇచ్చినప్పటికీ ఉదయాన్నే వారిని హౌస్ అరెస్ట్ చేసి కార్యక్రమానికి రానివ్వకుండా చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. కొల్లూరులో జరిగిన డబుల్ బెడ్ రూమ్ ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే రాకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మయూరి, పావని, సరిత, రామ్ సింగ్ నాయక్, నాయకులు రవీందర్, శ్యామ్ రావు, రాజు, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్, ఈశ్వర్, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి





నవతెలంగాణ-జోగిపేట

ముదిరాజ్‌ల పట్ల ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసి, జీఎస్ఆర్ టీవీ వీడియో జర్నలిస్ట్ బండి అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ అందోల్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శవ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా అందోల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తోట్ల రామకృష్ణ మాట్లాడుతూ.. ఖబడ్దార్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లకు వెంటనే బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల ముదిరాజుల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంగం సభ్యులు సత్యనారాయణ, సంతోష్, పవన్, విజయ్, సత్యం, శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : జర్నలిస్ట్ అజయ్ ముదిరాజ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ సంఘం నాయకులు నారాయణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం జహీరాబాద్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీడియా ప్రతినిధి అజయ్ ముదిరాజ్‌ను కౌశిక్‌రెడ్డి కిడ్నాప్ చేసి, చిత్ర హింసలకు గురి చేశాడన్నారు. అంతేకాకుండా అసభ్య పదజాలతో తీవ్రంగా దూషించాడన్నారు. కౌశిక్‌రెడ్డి పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జహీరాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి.. పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శంకర్, బరూర్ దత్తాత్రి ముదిరాజ్,శివ సాయి, రమేష్, మహేష్, అశోక్, జగన్, కిరణ్, ప్రభాకర్, రవి, అంజి, లక్ష్మణ్, తుకా రాం, దుర్గేష్, దత్తు, బద్రినాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండంలోని మిర్జాపూర్ (బి), ఖలీల్‌పూర్ గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు ఏక్‌నాథ్ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీ సంక్షేమ పథకాలపై ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఖలీల్‌పూర్ గ్రామస్తుడు, రిటైర్డ్ ఆర్మీ గోపాల్ రెడ్డి బీజేపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. పార్టీ గెలుపు లక్ష్యంగా ముందుకు పోవాలని ఏక్‌నాథ్ పాటిల్ సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచందర్ రాజనర్సింహ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, ప్రభుచారి, జనార్ధన్‌రెడ్డి, ఓనంరెడ్డి, ఓంకార్, శ్రీనివాస్, నర్సింలు ఉన్నారు.

రోడ్డు మార్గం ద్వారా మహారాష్ట్రకు సీఎం..

- ఘన స్వాగతం పలికేందుకు నాయకుల ముమ్మర ఏర్పాట్లు

నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు(సోమవారం) మహారాష్ట్రలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రగతి భవన్ నుంచి బయలుదేరిన సీఎం కాన్వాయ్.. పటాన్చెరు, సంగారెడ్డి, సదాశివపేట మీదుగా 11.30 గంటలకు జహీరాబాద్ చేరుకుంటుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు మహారాష్ట్రలోని ఉమర్గా వెళ్తారు. అయితే ఈసారి రోడ్డు గుండా సీఎం కాన్వాయ్ వెళ్తుండడంతో.. స్థానిక శాసనసభ్యులతో పాటు పార్టీకి చెందిన వివిధ నాయకులు ముఖ్యమంత్రికి జాతీయ రహదారి 65పై ఘన స్వాగతం పలికేందుకు ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. కాగా జహీరాబాద్ ప్రాంతంలో తేనేటి విందు స్వీకరించాలని ఎమ్మెల్యే మాణిక్యరావు, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు మహమ్మద్ తనివిర్, డిసిఎం ఎస్ చైర్మన్ శివకుమార్లు విన్నవించినట్లు తెలిసింది. మొదటిసారి రోడ్డు మార్గంలో ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళ్తుండడంతో కార్యకర్తలు, నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జహీరాబాద్ డీఎస్పీ వి.రఘు సాంథ్యంలో జహీరాబాద్ సరిహద్దు నుంచి మహారాష్ట్ర వరకు అన్ని ఏర్పాట్లను పోలీసులు పరిశీలిస్తున్నారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా అడుగడుగున క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

దళితుల భూముల జోలికి వస్తే పోరాటం తీవ్రతరం



- హెచ్‌ఎండిఏ లేఅవుట్ పేరుతో పేదల భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగదు.
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మానిక్

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట దళితుల భూముల జోలికి వస్తే పోరాటం తీవ్రతరం చేస్తామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హెచ్ఎండిఏ లేఔట్ పేరుతో దళితుల భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం సరికాదన్నారు.హెచ్ఎండిఏ లేఅవుట్ పేరుతో గుంజుకునేందుకు చూస్తున్న సదాశివపేట దళితుల భూముల్లో బాధితులతో కలిసి కేవీపీఎస్ నాయకులు ఆదివారం పర్యటించారు.ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. సదాశివపేటకు చెందిన 200 దళిత కుటుంబాల భూములను రియల్ ఎస్టేట్ దందా చేయడానికి అధికారులు ప్రయత్నించడం దారుణమన్నారు. సర్వే నంబర్ 165లో గల 114.21 ఎకరాల సర్కారు భూమిని కొన్నేండ్ల క్రితం ప్రభుత్వమే దళితులకు పంపిణీ చేసిందన్నారు. హైదరాబాద్ బాంబే నేషనల్ హైవేకు అనుకొని ఉన్న ఈ భూముల విలువ ఎకరాకు సుమారు రూ.2 నుండి 3 కోట్ల వరకు ఉన్నదన్నారు. ఈ మొత్తం భూమి విలువ రూ.350 కోట్లకు పైగా ఉంటుందన్నారు. దీంతో పేద దళితుల భూములను కొందరు గుంజుకొని లేఅవుట్ చేసి ప్లాట్లు అమ్మాలని చూస్తున్నారని, వేల కోట్లలో బిజినెస్ చేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. సారవంతమైన ఈ భూములకు సాగునీరు అందిస్తే బంగారం లాంటి పంటలు పడుతున్నాయన్నారు. అలాంటి భూముల్లో రియల్ దందా చేయడం సిగ్గు చేటన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హెచ్ఎండిఏ లేఅవుట్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా వెంటనే ఆపాలని, దళితుల భూముల జోలికి రావొద్దన్నారు. లేని పక్షంలో దళితుల పక్షాన పోరాటం తీవ్రత చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సదాశివపేట దళిత రైతులు సుధాకర్, సిద్దాపురం శంకరయ్య, చుక్కల మానేయ ప్రేమ్ సాగర్ లక్ష్మయ్య , బెంజిమెన్ బేగరి భాస్కర్, కిష్టయ్య మైపాల్ మోహన్, లలిత మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయానికి బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-న్యాల్‌కల్



వర్షాలు సమృద్ధిగా పడి.. పాడి పంటలుతో రైతులు సుఖ సంతోషంగా ఉండాలని చాల్కి గ్రామస్తులు ఆదివారం బీరప్ప ఆలయానికి బోనాలు ఊరేగింపును నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని, గ్రామ పెద్దలతో డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా బీరప్ప గుడికి వెళ్లారు.




రైతు రుణమాఫీ వెంటనే చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు జి. సాయిలు

నవతెలంగాణ-జోగిపేట

రైతులకు ఒక లక్ష రుణమాఫీని వెంటనే చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు జి. సాయిలు డిమాండ్ చేశారు. జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిలు మాట్లాడు తూ.. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఏండ్లు గడుస్తున్నా.. అమలు జరగలేదన్నారు. బ్యాంకర్ల ఒత్తిడితో ఎంతోమంది రైతులు మానసికంగా కృంగిపోతున్నారన్నారు. యాసంగి సీజన్ మొదలై నెల గడుస్తున్నా రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. సబ్సిడీతో కూడిన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఏరియా కమిటీ కన్వీనర్ విద్యాసాగర్ , ఏరియా కమిటీ సభ్యులు నాగభూషణం, మాధవి తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో కట్టడి.. ముట్టడి

వాహనాలు నడిపే వారికి సలహా సూచనలు : తూప్రాన్ సీఐ శ్రీధర్



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో ఆదివారం తూప్రాన్ సిఐ శ్రీధర్ వెల్దుర్తి ఎస్సై మధుసూదన్ గౌడ్‌లతో కలిసి కట్టడి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. బైకులు కలిగిన వ్యక్తులతో మాట్లాడి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామ చావడి వద్ద గ్రామస్తులకు సలహాలు సూచనలు చేశారు . ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ హెల్మెట్ తప్పకుండా ఉండాలన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు . సరైన సమాధానం చెప్పని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అట్టి వ్యక్తుల వివరాలు పోలీస్ స్టేషన్‌కు చేరవేయాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎస్సై ప్రకాష్ గౌడ్, శివంపేట ఎస్సైతో పాటు సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షునిగా గడీల శేషశయనరెడ్డి



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట మండల రెడ్డి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం లక్ష్మీనగర్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మండల రెడ్డి సంఘము సమావేశం జరిగింది. మండల పరిధిలో అన్ని గ్రామాల నుంచి రెడ్డి సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అధ్యక్షునిగా అరికెల గ్రామానికి చెందిన గడీల శేషశయన రెడ్డిని పలు గ్రామాల నాయకులు సూచించగా సంపూర్ణ మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా రెడ్డి సంఘం కార్యాదర్శి శ్రీకాంత్ రెడ్డి ప్రకటించారు. కార్యదర్శిగా నాగి రెడ్డి (గాందారిపల్లి), ఉపాధ్యక్షునిగా కొన్యాల బాలిరెడ్డి (కుర్తివాడ)తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రైల్వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆగిన రైల్వే బ్రిడ్జి పనులు

కొద్దిపాటి వర్షానికి బ్రిడ్జి కింద నిలిచిన నీరు
పరిసర ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది కరం.



నవతెలంగాణ-వెల్దుర్తి

రైల్వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన రైల్వే బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికి రైల్వే బ్రిడ్జి కింద చెరువును తలపిస్తున్న మాదిరిగా నీరు నిలిచాయి. మాసాయిపేట మండలం బొమ్మారం పరిసరాల్లో రైల్వే బ్రిడ్జి పనులు గత కొంతకాలంగా కొనసాగుతున్నాయి. కాంటాక్టర్ నిర్లక్ష్యం వలన పనులు ఆగిపోయి బొమ్మరంతో పాటు నాగసానిపల్లి కొప్పులపల్లి మరికొన్ని గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొద్దిపాటి వర్షానికి రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచి రాకపోకలు బంద్ అయితే జీవన మనుగడ కష్టమవుతుందని ప్రజలు వాపోతున్నారు. అనునిత్యం జాతీయ రహదారి పక్కన పలు కంపెనీలు ఉండడం వలన అందులో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు నీరు నిలవడంతో రాకపోకలు బంద్ కావడంతో కంపెనీలకు వెళ్లక పూట గడవక కుటుంబం పస్తులు ఉండే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మార్గాన్ని సులువుతరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులుగా అశోక్ గౌడ్



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు అశోక్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులుగా ఎన్నికైన అశోక్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీసీ సెల్ మండల అధ్యక్షులుగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన నియమకానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పాఠశాలల బంధు



నవతెలంగాణ-నిజాంపేట

జూన్ 26 న నిర్వహిస్తున్న పాఠశాలల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ ప్రశాంత్ కోరారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బంద్‌కు విద్యార్థి, విద్యార్థినిలు తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని అలాగే పెండింగ్‌లో ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని తక్షణమే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-టేక్మాల్

మృతుల కుటుంబాలను పరామర్శించడానికి, ఆదివారం మండల కేంద్రమైన జనం సాక్షి రిపోర్టర్ మహేందర్ రెడ్డి (చిన్న)తల్లి ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శ అవినాష్ కుమార్, నాయకోటి భాస్కర్, సిద్దయ్య, మాణిక్యం, చింత రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కె వెంకటాపూర్ గ్రామానికి చెందిన బొమ్మ పరుశరాములు అనారోగ్యంతో కొంపల్లిలోని శ్రీకర హాస్పిటల్లో చికిత్స పొందారు. ఆరోగ్య ఖర్చుల నిమిత్తం శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మినిస్టర్ క్వార్టర్స్‌లో బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంపూర్ దయాకర్, రాంపూర్ మధు, జనగామ రాజేందర్, శ్రీనివాస్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు పంపిణీ



నవతెలంగాణ-కొండపాక

క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుండిగళ్ళ లింగం పుట్టినరోజు సందర్భంగా కొండపాక మండలంలోని సిరిసనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లితండ్రులు లేని 22 మంది విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండపాక మండల విద్యాధికారి పురుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్నవారు సమాజంలో చాలామంది ఉన్నప్పటికీ సేవ చేసే గుణం కొంతమందికే ఉంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరినప్పుడే పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు వస్తుందన్నారు. క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లింగ శ్రీనివాస్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా విద్యార్థులకు, సమాజానికి సంబంధించిన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ఉన్నత పాఠశాలలో 1996-1997 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువు చెప్పిన గురువుల సమక్షంలో యోగ క్షేమాలు తెలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు ఆర్. రామచంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు జి.నరసింహ్మా స్వామి, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు దేవులపల్లి యాదగిరి, పాత సురేష్, చక్రాధర్, నెల్లుట్ల నర్సింలు, శ్రీనివాస్, నేపాల్ శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, పొల్సాని సుధాకర్, వెంకట్రామిరెడ్డి, కమలాకర్, రజనీకర్ రెడ్డి, ఘణపురం సాయిలు, లుబీనా, కమల, రాజేశ్వరి, సుకన్య, శివలక్ష్మీ పాల్గొన్నారు.

28న సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-రేగోడు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదిన మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ సరోజన సాయిలు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో సీతారావమ్మ తెలిపారు. కావున మండలాధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

అక్రమ వ్యాపారం వద్దన్నందుకు సమావేశం బహిష్కరణ

- వెంటనే ఎఫ్‌టీఎల్ కబ్జా నుంచి విడిపించాలి
- సర్పంచ్ నరాల ప్రభావతి పెంటయ్య





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

చట్ట వ్యతిరేక వ్యాపారం వద్దని అక్రమంగా కుంట ఎఫ్‌టీఎల్‌ను కబ్జా చేసిన వారికి వత్తాసు పలుకుతూ మట్టిని తరలించి కబ్జా చేయవద్దని అన్నందుకు వార్డు సభ్యులు పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారని సర్పంచ్ నరాల ప్రభావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో 377 సర్వే నంబర్‌లో 7 ఎకరాలలో రొడ్డాయ కుంట ఉందన్నారు. దానికి గ్రామ శివారులో నుంచి పెద్ద కుంట, పిన్న కుంట, దండోని కుంటల నుండే కాకుండా టీఎస్‌ఐఐసి పరిశ్రమల నుంచి పెద్ద ఎత్తున నీరు వస్తుందని అది పూర్తిగా కాలువల ద్వార రొడ్డాయ కుంటలోకి వెలుతుందని తెలిపారు. అదే భూమిలో రామారావ్, జయసింగ్ భాటియాలు 375, 376, 363, 365 సర్వే నంబర్‌లలో సుమారు ఆరెకరాల భూమిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కాగా ఇదే నాలుగు సర్వే నంబర్‌లలో సుమారు 34 గుంటల భూమి మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వెర్షన్ అయినట్టు తెలిపారు. కాగా గ్రామ పంచాయితీకి చెందిన గ్రామ ఉపసర్పంచ్‌తో పాటు మరి కొంత మంది పాలక వర్గ సభ్యులు కలిసి అక్రమంగా కుంట ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించుకుని ఉన్న భూమిలో రాత్రి వేళల్లో కూచారం గ్రామం నుంచి టిప్పర్ల ద్వార మట్టిని తరలించి కబ్జాకు పాల్పడుతున్నట్టు సర్పంచ్ తెలిపారు. దానిని వద్దన్నందుకు శనివారం జరిగిన పాలకవర్గ సమావేశానికి రాకుండా బహిష్కరించినట్టు తెలిపారు. అక్రమ వ్యాపారం వద్దని గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు ఉన్నాయని వాటిని చేసుకోవాలని తెలిపినా ఎవరు ముందుకు రావడంలేదన్నారు. కేవలం అక్రమ వ్యాపారంపైనే మక్కువ చూపుతున్నారన్నారు. తానొక మహిళా సర్పంచ్‌గా ప్రభుత్వ కార్యాక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నప్పటికి మహిళా వార్డు సభ్యులు మాత్రం పాల్గొనకుండా వారి భర్తలు పాల్గొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నప్పటికి తాము గ్రామభివృద్ధిపైనే శ్రద్ధ తీసుకుంటున్నట్టు సర్పంచ్ ప్రభావతి ఆవేదనతో తెలిపారు. అక్రమంగా కుంట ఎఫ్‌టీఎల్‌ను కబ్జాచేయడం చట్టవ్యతిరేకమని తెలిపారు. కుంటలోకి నీరు వెల్లకుండా అడ్డంగా మట్టిని పోయడంతో పక్కనే ఉన్న రైతుల పొలాల్లోకి వర్షంనీరు వచ్చి పంటలు పూర్తిగా పాడవుతున్నట్టు రైతులు తెలిపారు. రైతులకు అండగా నిలవాల్సిన పాలకవర్గం సభ్యులు అక్రమంగా కుంట ఎఫ్‌టీఎల్‌ను కబ్జాచేసి మట్టిని పోసి రైతులకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేసి కబ్జాకు గురైన కుంట ఎఫ్‌టీఎల్‌ను కాపాడి వర్షపు నీరు సక్రమంగా కుంటలోకి వెల్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరారు.

నర్సాపూర్ నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి
- సునితా రెడ్డి అనుభవిస్తున్న పదవులన్ని కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్





నవతెలంగాణ-నర్సాపూర్

వచ్చే ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ అన్నారు .ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని మెదక్ వెళ్లే మార్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని .కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు నర్సాపూర్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి గాలి అనిల్ కుమార్ మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా కొనసాగుతున్న సునీత రెడ్డి కి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. సునీత రెడ్డి నర్సాపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున మూడు పర్యాయాలు ,మ్మెల్యేగా మంత్రి గా పని చేశారన్నారు. రాజకీయ బిక్ష పెట్టిన పార్టీని మోసం చేసి సునీత రెడ్డి స్వార్థ రాజకీయాల కోసం బి ఆర్ ఎస్ పార్టీలో చేరి ప్రస్తుతం మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా కొనసాగుతున్నారన్నారు. సునీత రెడ్డి అనుభవిస్తున్న పదవులు కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష అని గుర్తు చేశారు. కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసిన సునీత రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, రవీందర్ రెడ్డి, ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, నాయకులు శ్రీనివాస్ గుప్తా ఆంజనేయులు గౌడ్ అశోక్, రామాగౌడ్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్లాబ్ నిర్మాణానికి జెడ్పీటీసీ విరాళం



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని లచ్చిరెడ్డి గూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం గుడి స్లాబ్ నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహాయంగా రూ.50 వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, రామ్ రెడ్డి , సురేందర్ రెడ్డి, మైపాల్ రెడ్డి, కుమార్, మాణిక్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని సీతారాం తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయ ఉత్సవాలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా రూ.40 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ రాజంపేట పద్మా వెంకటేష్, తండావాసులు రాజేందర్ నాయక్, కిషన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ స్వర్ణకార సంఘం రాష్ట అధ్యక్షుడు రాఘవచారి



నవతెలంగాణ-మెదక్

జనాభా ప్రకారం స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటుచేయాలని తెలంగాణ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవచారి డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్ పట్టణంలోని వైస్రాయి గార్డెన్స్‌లో జిల్లా స్వర్ణకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం స్వర్ణకార సమస్యలను పరిష్కారించలేదన్నారు. ప్రభుత్వం గతంలో స్వర్ణకారులకు రూ.250 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. స్వర్ణకారుల సమస్యలపై మంత్రి కేటీఆర్‌ను కలిసినా ఎలాంటి స్పందనలేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్వర్ణకారులకు నిధులు కేటాయిస్తే కార్పొరేట్ కంటే నాణ్యమైన ఆభరణాలు తయారుచేస్తామన్నారు. స్వర్ణకారులను విస్మరిస్తే సహించేది లేదన్నారు. రెడిమెడ్ షాపులు వచ్చి పనులులేక గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. 50 ఏళ్లు నిండిన స్వర్ణకారులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 217 జీఓను సవరించాలని కోరారు. అనంతరం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త కార్యవర్గం స్వర్ణకారుల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచన విధానంతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. స్వర్ణకారులకు స్థలం కేటాయిస్తామన్నారు. పేద స్వర్ణకారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని, మెదక్‌లో జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి విశ్వ బ్రాహ్మణ భవనానికి రూ 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని నూతన కార్యవర్గానికి అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పూన రవి చారి, జిల్లా కార్యదర్శి సుంకోజు దామోదర్‌చారి, గౌరవ అధ్యక్షుడు మోత్కూరి లక్ష్మి కాంతం చారి, పట్టణ అధ్యక్షుడు రమేష్, బ్రహ్మచారి, స్వర్ణకారులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

ముదిరాజ్ మహాసభ నాయకులు దాసరి నరేష్‌ముదిరాజ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో అన్నదమ్ములుగా కలిసి మెలసి ఉంటున్న తమ మధ్య కులాల చిచ్చుపెట్టాలని చూస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మనోహరాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, ముదిరాజ్ మహాసభ నాయకులు దాసరి నరేష్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విదంగా మాట్లాడినట్టు తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు ముదిరాజ్‌లను చాలా బాధించాయని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కులా, మతాలకు అతీతంగా కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్నట్టు తెలిపారు. కానీ ముదిరాజ్‌ల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ముదిరాజ్‌లకు క్షమాపణ చేప్పించాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు మండల ముదిరాజ్ అధ్యక్షులు దాసరి నరేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

















నవతెలంగాణ-చిలిపిచెడ్ : ముదిరాజ్ జర్నలిస్టు బండి అజయ్‌ని కులం పేరుతో దూషించిన వ్యాఖ్యలు ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రం చిలిపిచెడ్‌లో మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లోలో ఫిర్యాదు చేసి కౌశిక్ రెడ్డిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి హన్మంత్ రమణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హన్మంత్ రమణారావు, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులాన్ని అవహేళన చేసి అజయ్‌పై దాడి చేసిన ఎమ్మెల్సీని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి నీచ సంస్కృతి అహంకార ధోరణి వల్ల బీఆర్ఎస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు గొట్టం దశరథ్, ఉపాధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి మేకల జనార్ధన్, రాందాస్ పల్లి సర్పంచ్ అంకం యాదగిరి, చిలప్ చెడ్ ఉప సర్పంచ్ హన్మంత్, సోమక్కపేట సొసైటీ డైరెక్టర్ గంగాధర్, బండపోతుగల్ ఉప సర్పంచ్ మాణిక్యం, కొన్యాల యాదగిరి, దుర్గాచలం, శంకర్, శేఖర్, మండలానికి చెందిన ఆయా గ్రామాల ముదిరాజ్ యువకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొల్చారం : ఇటీవల ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని మండల ముదిరాజ్ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం కొల్చారంలో మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నిరసనకు దిగిన ముదిరాజ్‌లు ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు గడ్డమీది నరసింహులు మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల పై అనుచిత వ్యాఖ్యలు చేసి, జీఎస్ఆర్ టివి వీడియో జర్నలిస్ట్ బంచి అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి వారి అనుచరులతో కలిసి దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల మాజీ అధ్యక్షులు చంటయ్య, అంజయ్య, చింతల యాదగిరి, గోపాల్, ధన్ రాజ్, రమేష్, యాదగిరి, రాజు, నాగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-మెదక్ టౌన్ : ముదిరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డిపై తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్లో మెదక్ పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సున్నం నరేష్, ప్రధాన కార్యదర్శి తలారి సంతోష్, మామిళ్ల ఆంజనేయులు, బైండ్ల సత్యనారాయణ, బాల గంగయ్య, మాణిక్యం, మాజీ ఎంపిటిసి రాములు ముదిరాజ్, చింతల రమేష్, మేకల ఆంజనేయులు, చింతల కార్తీక్, ఆది సురేందర్, బండ రాము, బండ శేఖర్, ముదిరాజ్ యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్ : ముదిరాజులును కించపరిచే విదంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని ముద్దిరాజ్ సంఘము మండల అధ్యక్షుడు రాగుల రాజు డిమాండ్ చేశారు. ఆదివారం జగదేవపూర్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన కౌశికొరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కులాన్ని గురించి నీచంగా మాట్లాడిన వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. అంతరం కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భిక్షపతి, మంజుల రమేష్, రాజేశ్వరి రవి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు సురేష్, మహిళ విభాగం అధ్యక్షురాలు జయమ్మ, సంఘము నాయకులు పరమేశ్వర్, మహేష్, సుధాకర్, కనకయ్య, చంద్రం, రాజు,బాలకిషన్, కర్ణాకర్, స్వామి, ఎల్లేష్, పాల్గొన్నారు.

నవ తెలంగాణ మిరుదొడ్డి : జర్నలిస్టు అజయ్ ముదిరాజ్‌ను ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి కులం పేరుతో దూషిస్తూ ముదిరాజ్ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడడాన్ని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు విద్యాసాగర్ రావు. ఎంపీటీసీ సుతారి నర్సింలు తీవ్రంగా ఖండించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనుచరులు జర్నలిస్ట్ అజయ్ ముదిరాజును కిడ్నాప్ చేసి పాడి కౌశిక్ రెడ్డి వద్దకు తీసుకు వెళ్లిన తర్వాత ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఏ కులంరా నీది అంటూ.. ముదిరాజ్ కులం అని పేరు చెప్పగానే ముదిరాజ్ కులాన్ని కించపరిచే విధంగా దుర్భాషలాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఎమ్మెల్సీపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘ సభ్యులు గొట్టం బైరయ్య, పరువులు పాల్గొన్నారు

నవతెలంగాణ-నంగునూరు : ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ యువజన సమైక్య సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండి సతీష్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులాన్ని అవహేళన చేసి అజయ్‌పై దాడి చేసిన ఎమ్మెల్సీని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజ్‌లను బూతుమాటలు తిట్టిన కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలన్నారు. టీవీ జర్నలిస్ట్ అజయ్‌ను, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లను కులం పేరుతో దూషించన కౌశిక్ రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

నవ తెలంగాణ - సిద్దిపేట : ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఒకటో వార్డు లింగారెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుడైన యువ జర్నలిస్టుపై ఒక ఎమ్మెల్సీ హెూదాలో ఉండి దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ముదిరాజు కులస్తులపై దాడికి దిగిన పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామన్నారు. ఇప్పటికైనా బేషరతుగా ముదిరాజ్ కులస్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు తాటికొండ శ్రీనివాస్, కదుర్ల హేమంత్, తాటికొండ లక్ష్మయ్య, కనకయ్య, రాజేశం ,రవి ,బాలు ,కనకయ్య, నరసింహులు, రాజు,భాను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్ : ముదిరాజ్ కులంను చులకనగా చూస్తే నాయకులకు పుట్టగతులుండవని ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రొట్టెల శ్రీనివాస్, కోశాధికారి శ్రీరాం కృష్ణలు అన్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్‌లో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజురాబాద్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ముదిరాజ్ కులాన్ని అనుచిత వ్యాఖ్యలతో, అన్ పార్లమెంట్ వర్డ్స్ వాడటం సిగ్గుచేటన్నారు. ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు కొట్టాల యాదగిరి, కదుల్ల దేవేందర్, ఎల్లా శ్రీనివాస్, శ్రీరామ్ శ్రీనివాస్, పూదరి కుమార్,కుమార్, బోయిని రాజు, బెదరమైన బిక్షపతి, ఎల్ల మల్లేశం, కదుల్ల యాదయ్య, ఎల్లా శివరాములు, కాటు కళ్యాణ్, శ్రీరామ్ నాగేష్, కార్తీక్,రొట్టెల రవి, పూదరి ప్రవీణ్, ఎల్ల మధు, గుర్రాల కార్తీక్, పూదరి వెంకటేష్, వినయ్, శ్రీరామ మల్లేశం, కదుల్ల రామరాజు, ఉడుగుల నవీన్ కుమార్, రొట్టెల మల్లేశం,ఎల్ల నరేష్ పాల్గొన్నారు.



ప్రజ్ఞాపూర్‌లో ముదిరాజ్ ఎమ్మెల్సీకి ఘన స్వాగతం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్‌కి ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘ నాయకులు యువకులు ఘన స్వాగతం పలికారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆయనకు ప్రజ్ఞాపూర్ బస్ డిపో వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో ప్రజ్ఞాపూర్ యువకులు మాట్లాడుతూ రాజకీయంగా ముదిరాజులు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారని పేర్కొన్నారు ముదిరాజ్ కులంపై రాజకీయ నాయకులు చులకనగా మాట్లాడడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యువకులతో మాట్లాడుతూ కుల వ్యవస్థలపై దుష్ప్రచారం దుర్భాషలాడడం ఎవరి హక్కు కాదన్నారు. ఏ కులాన్ని కించపరిచే నైతిక హక్కు ఎవరికి లేదన్నారు. ఎవరి కులానికి వారే గొప్పగా అన్ని కులాలను ఆదరించాలన్నారు. ముదిరాజ్ కులం బలోపేతానికి యువకులు చైతన్యమై ముందుకు సాగుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ముదిరాజ్ సంఘం నాయకులు కొట్టాల యాదగిరి, కళ్యాణ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు విద్యార్థులు తరలిరావాలి



ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్ : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న నిర్వహించనున్న కలెక్టరేట్ ధర్నాకు విద్యార్థులు తరలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ కోరారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీమిక్స్ మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యార్థులకు రెండు జతలు దుస్తులు ఇవ్వాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని,ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో విద్యారంగం సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. తక్షణమే ఈ డిమాండ్లను నిర్వహించకపోతే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు గ్యార రాకేష్, సభ్యులు శశి కనకరాజు, నాగని శివ, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా సాయి కుమార్



నవతెలంగాణ-తొగుట

తొగుట మండల ముదిరాజ్ మహాసభల అధ్యక్షుడుగా ఉల్లెంగల సాయి కుమార్ ముదిరాజ్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షు డు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి కనకయ్య ముదిరాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి, పురోగతికి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్,రాష్ట కార్యనిర్వాహన కార్యదర్శి దమ్మిగారి కనకయ్య ముదిరాజ్, రాష్ట్ర యువత విభాగం కోఆర్డినేటర్ బొక్క శ్రీనివాస్ ముదిరాజ్,నాయకులు కొట్టాల యాదగిరి,వి.స్వామి,ధర్మ ముదిరాజ్,గొట్టం రాధా కృష్ణ,శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండలంలో భూముల క్రయవిక్రయాలు చేసుకున్న రైతులు, ఇంతవరకు రైతుబంధు రాని రైతులు వెంటనే రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టేదారు పాసుబుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, సేవింగ్ బ్యాంకు అకౌంట్ పాసుబుక్ జిరాక్స్, దరఖాస్తు ఫారం, తదితర పత్రాలను తీసుకొని మండల వ్యవసాయ కార్యాలయానికి వచ్చి సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు.

ఎంఎస్ఎన్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 18 మంది ఎంపిక



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని ఎస్వీ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ లాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 65 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 52 మంది విద్యార్థులు పాల్గొనగా 18 మంది అభ్యర్థులు ఎంపిక అయినట్లు రిక్రూట్‌మెంట్ హెచ్ఆర్ సుబ్రహ్మణ్యం, విజయ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కాలేజ్ ప్రిన్సిపల్ పి.రామకష్టారెడ్డి మేనేజ్‌మెంట్ సిబ్బంది అభినందందిచారు.

కోమటి చెరువును సందర్శించిన మంత్రులు



నవ తెలంగాణ - సిద్దిపేట

కోమటి చెరువును మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఆదివారం సందర్శించారు. కోమటి చెరువు మొత్తం కలియ తిరిగి వివరాలు తెలుసుకున్నారు.

మార్వాడీలు మా ఆత్మీయులు




ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

నవతెలంగాణ -గజ్వేల్

మార్వాడీలు మా ఆత్మీయులని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో మార్వాడి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా గజ్వేల్‌లోనే మార్వాడీ వృత్తితో జీవనం గడుపుతున్న మార్వాడీలు స్థానికులుగా మారిపోయారని అన్నారు. రానున్న కాలంలో రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం మార్వాడీలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. రానున్న కాలంలో రాజకీయంగా ప్రోత్సహిస్తామన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకుపోయి వారికున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి మల్లేశం, ఎంపీపీ అమరావతి, నవాజ్ , శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, రాజు, మార్వాడి సంఘం నాయకులు బాబూలాల్, మాణిక్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాదరి బాలమల్లు కుటుంబానికి మంత్రుల పరామర్శ



నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర పరిశ్రమల శాఖ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తల్లి కమలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన దశదినకర్మలో మంత్రులు జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డిలతో కలిసి మంత్రి హరీష్‌రావు ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గ్యాదరి కిషోర్, రసమయి బాలకిషన్, శాసన మండలి చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొని నివాళులు అర్పించారు.

దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం



నవ తెలంగాణ -గజ్వేల్

రెండో విడత దళిత బంధు అందించడానికి ఉత్తర్వులు జారీ చేసి దళితుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ దాసరి అమరావతి శ్యామ్ మనోహర్, జెడ్పిటిసి పంగ మల్లేశం, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు బొగ్గుల చందు అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సీఎం కేసీఆర్, మంత్రులు తన్నీరు హరీష్ రావు, కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రెండో విడత దళిత బంధు అనుమతి కోసం ఉత్తర్వులు జారీ చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు తుమ్మ శ్రీనివాస్, పొన్నాల కుమార్ తదితరులున్నారు

బీఆర్ఎస్వీ యువత కమిటీల ఏర్పాటు



నవ తెలంగాణ-దౌల్తాబాద్ : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సంబారపు నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థి, యువత కమిటీలను ఏర్పాటు చేశారు. యూత్ అధ్యక్షులుగా సిహెచ్ ప్రశాంత్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, మల్లేష్, బిఆర్ఎస్వీ అధ్యక్షులుగా నవీన్, ఉపాధ్యక్షులు జగన్,రమేష్ ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాచిన్ పల్లి గ్రామ సర్పంచ్ యాదమ్మ లచ్చయ్య, బొక్కల నాగరాజు, బిఆర్ఎస్ అధ్యక్షులు నాగభూషణం, బిఆర్ఎస్వీ దౌల్తాబాద్ అధ్యక్షులు ఆనంద్, గొల్ల నవీన్, మామిండ్ల స్వామి, తదితరులు గ్రామ యువత పాల్గొన్నారు.

మీతోటే మొదటి బోణి

- అందరి ప్రేమ, అభిమానం, ఆదరణకు సంతోషం
- అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లతోనే ఈ స్థాయిలో ఉన్నాం
- ప్రజలను చైతన్యం చేయడంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకం
- ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు



నవ తెలంగాణ - సిద్దిపేట

'ఆత్మీయ ఏకగ్రీవ తీర్మానం ఇవ్వడం మీతో మొదటి బోణీ కావడం, మీ అందరి ప్రేమ, అభిమానం, ఆదరణకు నాకు చాలా సంతోషంగా ఉన్నది' అని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మాల ఏంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా ఆత్మీయ తీర్మానం కనకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ లతో కలిసి మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ రాష్ట్ర రాజధానిలో 127 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి గౌరవించుకున్నామని తెలిపారు. మేపా కోరినట్లుగా 500 గజాల స్థలాన్ని కేటాయింపు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు సిద్దిపేట వాసులుగా మీరంతా అదృష్టవంతులని, తెలంగాణ రాష్ట్ర జాతిపిత సీఎం కేసీఆర్ ఆలోచన విధానాలు అమలు చేసేది మంత్రి హరీశ్‌రావు అని తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ అన్నారు. ఆత్మీయ తీర్మానం చేయడం హర్షించదగిన విషయమని, మొదట మీతోనే శంఖం పూరించినట్లు మూడవ సారి కూడా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం వస్తుందని సీఎం కేసీఆర్ ఉంటారని, సిద్దిపేటలో హరీశన్న విషయానికొస్తే చెప్పేదేమీ లేదని, మీరే అండగా ఉంటామని ఏకగ్రీవ తీర్మానంతో స్పష్టమవుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామి దాస్, డిప్యూటీ తహశీల్దార్ రాజేశం, అసోసియేషన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణ సిద్దిపేట అర్బన్

అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లతోనే ఉద్యోగులుగా, మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా అవకాశాలు వస్తున్నాయని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం విపంచి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్టు నెట్ వర్క్ షాప్‌లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ అంబేద్కర్ చెప్పిన సూచనలు కొంతమంది మాత్రమే పాటిస్తున్నారన్నారు. ప్రజలను చైతన్యం చేయడంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదన్నారు. పోటీ ప్రపంచంలో దళిత జర్నలిస్టులు నిలదొక్కుకోవడానికి ఐడిజేఎన్ పని చేస్తుందన్నారు. ఆడ పిల్లలు చదవాలంటే అనేక ఇబ్బందులు ఉండేవని, నేడు మహిళ కళాశాలలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ దఫాలో అన్ని నియోజకవర్గాల్లో దళిత జర్నలిస్టులకు దళిత బంధు ఇస్తామన్నారు. ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో ప్రథమ స్థానంలో తెలంగాణ ఉందన్నారు. దళిత జాతి కోసం పనిచేసే విధంగా దళిత జర్నలిస్టులు పని చేయాలన్నారు.

రిజిస్ట్రేషన్ భూమిని మున్సిపాలిటీకి అప్పగిస్తా

ఎమ్మెల్యే కూతురు తుల్జా భవానీరెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణం పెద్ద చెరువు మత్తడి స్థలంలోని 1402సర్వే నెంబర్లో గల 1270 గజాల స్థలాన్ని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తనకు తెలియకుండానే తన పేరిట అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారని గత కొన్ని రోజులుగా కూతురు తుల్జాభవానీరెడ్డి ఎమ్మెల్యే ముత్తిరెడ్డిని నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ముత్తిరెడ్డి కూతురు తుల్జాభవానీరెడ్డి ఆదివారం చేర్యాలకు వచ్చారు. పెద్ద చెరువు మత్తడి స్థలాన్ని చేర్యాల మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేస్తానంటప్ల నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు. మత్తడి స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా తుల్జా భవానీరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జనగామ ప్రాంతానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన తండ్రి ఇలాంటి అక్రమాలకు పాల్పడడం సిగ్గుచేటని, ఎమ్మెల్యే అవ్వకముందే తన తండ్రికి వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. వేల కోట్ల ఆస్తులు ఉండి, ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న తన తండ్రి చేర్యాల ప్రాంత ప్రజల స్థలాన్ని తన పేరు మీద అక్రమ రిజిస్ట్రేషన్ చేయించడం తప్పే అని, ఇందుకు తనను చేర్యాల ప్రజలు క్షమించాలని కోరారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు మరల జరగకుండా కోర్టు ద్వారా మత్తడి స్థలంలోని 1270 గజాల స్థలాన్ని చేర్యాల మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసి కలెక్టర్‌కు అప్పగిస్తానని తెలిపారు. మత్తడి పరిరక్షణ సమితి నాయకులు, పట్టణ ప్రజలు ఎమ్మెల్యే కూతురు తుల్జాభవానీరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పాత బస్ స్టాండ్ వద్ద టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఇది చేర్యాల ప్రాంత ప్రజల విజయమన్నారు.



అవినీతి అక్రమాలను చేర్యాల ప్రాంత ప్రజలు ఎప్పటికీ సహించరని తెలిపారు. రాబోయే రోజుల్లో చేర్యాల ప్రాంత అస్తిత్వాన్ని కాపాడేందుకు మరిన్ని ఉద్యమాలు చేసి విజయాలు సాధిస్తామని అన్నారు.

ప్రజల చెంతకు ఆర్టీసీ సేవలు



నవ తెలంగాణ దౌల్తాబాద్

ఆర్టీసీని లాభాల బాట పట్టించడానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గ్రామ బస్సు అధికారులను ఆదివారం నియమించింది. ఆర్టీసీ సేవలను ప్రజలకు వివరిస్తూ సురక్షిత ప్రయాణానికి బస్సులో వెళ్లాలని వీరు సూచిస్తారు. దివ్యాంగులు, విద్యార్థులకు రాయితీ బస్సుపాసులు, గ్రామాలలో పెళ్లిళ్లు, శుభ కార్యాలకు బస్సును అద్దెకివ్వడం, టి9, టి24 టికెట్ గురించి ఇతర పథకాల గురించి వివరిస్తారు. దౌల్తాబాద్, దొమ్మాట, గాజులపల్లి, లింగరాజ్ పల్లి, సూరంపల్లి, ముత్యంపేట, శేర్ పల్లి బందారం , నర్సంపేట నర్సంపేట, మల్లేశం పల్లి శౌ రిపూర్, ముబారస్ పూర్, హైమద్ నగర్, తిరుమలాపూర్ గ్రామాలకు దొంతుల కృష్ణ, మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని బోనాల, నిజాంపేట మండల పరిధిలోని దొంగల ధర్మారం కిష్టాపూర్, పులిమామిడి, దౌల్తాబాద్ మండల పరిధిలోనిని కోనాయిపల్లి, గోవిందా పూర్, ఉప్పరపల్లి, గువ్వలేగి, దీపాయంపల్లి, గొడుగుపల్లి, మహమ్మద్ షాపూర్, ఇందుప్రియాల్ గ్రామా గ్రామాలకు కౌకూరి సిద్ధిరాములును గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ విలేజ్ బస్సు ఆఫీసర్లుగా నియమించారు.



నవ తెలంగాణ రాయపోల్ : ఆర్టీసీ సేవలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లి మరింత ఉపయోగపడే విధంగా అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర కమిషనర్ సజ్జనార్ విలేజ్ బస్సు అధికారులను నియమించారు. దీనిలో భాగంగానే రాయపోల్ మండల బస్సు అధికారిగా బాగన్నగారి జయేందర్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా జయేందర్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉంటూ అనేక మందిని గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీది ఎనలేని పాత్ర అన్నారు. విద్యార్థులకు, దివ్యాంగులకు పూర్తిగా ఉచితంగా బస్ కాసులు అందిస్తామని తెలిపారు.

ఉరేసుకొని హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



నవతెలంగాణ-సంగారెడ్డి: ఉరేసుకొని హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డిలో ఆదివారం జరిగింది. సంగారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీదర్‌రెడ్డి కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామానికి చెందిన మీసాల మాణిక్యం(52) సంగారెడ్డిలోని అయ్యప్ప కాలనీలో నివాసముంటున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించేవాడు. ఇటీవల హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి రావడంతో సైబరాబాద్ పరిధిలోని మోకిల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సంగారెడ్డిలోని తన నివాసంలో ఆదివారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత సమస్యలే హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్యకు కారణమైనట్లు సమాచారం. మృతుడికి భార్య ప్రశాంతి, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు ఎంబిబిఎస్ చదువుతుండగా, చిన్న కూతురు ఇంజనీరింగ్ చేస్తున్నది. మాణిక్యం ఆత్మహత్య సమాచారం అందుకున్న వెంటనే మోకిల సీఐ నరేష్, ఎస్సై కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాలకు వరాలు

నవతెలంగాణ-బెజ్జంకి: ఉచిత వైద్య శిభిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు గొప్పవరం లాంటివని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో రేవోజు ఎల్లమ్మ పాపయ్య స్మారకార్థం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎస్ వీ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ నర్సింగరావు ప్రారంభించారు.

దుర్గామాతను దర్శించుకున్న నాయకులు

నవతెలంగాణ జగదేవపూర్: ధర్మారం గ్రామంలో నూతనంగా ఆవిష్కరించిన శ్రీ దుర్గా మాత నూతన దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండ రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రాజు, గ్రామ అధ్యక్షులు ఆంజనేయులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఐలయ్య శాలువాతో సన్మానించారు.వెంకటేష్, ఆంజనేయులు, కనకయ్య, కృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

వర్గీకరణపై రాజీలేని పోరాటాలు

ఎన్ని అడ్డంకులు వచ్చినా తగ్గేదే లేదు

మంత్రివర్గంలో మాదిగలకు అన్యాయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

ఎస్సీ వర్గీకరణపై 29 సంవత్సరాలుగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా పోరాటాలకు వెనక్కి తగ్గేది లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన ఎం.ఎస్.పి.ఎం.ఆర్.పి.ఎస్.ఎం.ఎస్.ఎఫ్ అనుబంధ సంఘాల జిల్లా సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా నిర్బంధాలు విధించినా ప్రాణాలకు తెగించి ఎస్సీ వర్గీకరణ కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. 2000 సంవత్సరంలో వర్గీకరణ సాధించుకుని ఎంతోమంది మాదిగలకు ఉద్యోగ అవకాశాలు తెచ్చుకున్నామని అన్నారు. మాల కులస్తులు సుప్రీంకోర్టు వెళ్లడం ద్వారా వర్గీకరణ రద్దు అయిందని అన్నారు. వర్గీకరణ కోసం ప్రతిపక్షం అధికారపక్షం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ ఏర్పాటులో మాదిగలు కీలకపాత్ర పోషిస్తే రాజకీయంలో మాదిగలకు కనీస గౌరవం లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 శాతం ఓటింగ్ ఉన్న మాదిగ కులస్తులకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం శోచనీయం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనాథ పిల్లల కోసం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, మల్లేశం, పెరుక పరిశరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు పార్టీలకతీతంగా ఉద్యమం

జేఏసీ నాయకుడు అందెఅశోక్, ఆకునూరు జేఏసీ కన్వీనర్ రఘువీర్

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా సాధించడం కోసం పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ఐక్యంగా పోరాడుతామని జేఏసీ నియోజకవర్గ నాయకుడు అందె అశోక్ తెలిపారు. చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామ పంచాయతీ వద్ద ఆదివారం జేఏసీ సమావేశం పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా అందె అశోక్, మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య గౌడ్ మాట్లాడుతూ చేర్యాల పరిస్థితి కుడిదిలో పడ్డ ఎలుకలా తయారైందని నియోజకవర్గం జనగామ, పార్లమెంటు భువనగిరి, జిల్లా సిద్దిపేట, విద్యుత్ హుస్నాబాద్, వ్యవసాయ శాఖ గజ్వేల్, చేర్యాల కొమురవెల్లికి రెవెన్యూ డివిజన్ సిద్దిపేట, మద్దూర్, దూల్మిట్ట మండలాలకు కోర్టు రెవెన్యూ డివిజన్ హుస్నాబాద్ ప్రాంతాలకు చేర్చి చేర్యాల ప్రాంత ప్రజలను విడదీసి కుక్కలు చింపిన ఇస్తారు లాగా విభజించారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని అర్హతలు కలిగిన చేరాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీలు, జేఏసీలు గత కొన్ని సంవత్సరాలుగా జెండాలు, ఎజెండాలు పక్కనపెట్టి పోరాటాలు నిర్వహిస్తూ గ్రామపంచాయతీలు తీర్మానం చేసి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, మంత్రి హరీష్ రావులకు పంపిస్తే కనీసం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం ప్రభుత్వ అసమర్థత పాలనకు నిదర్శనం అన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేర్చకుండా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ స్థానికేతరుడు కాబట్టే ఈ ప్రాంతం మీద సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని మండిపడ్డారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాన్ని పునరుద్ధరన సాధించేంతవరకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మిలిటెంట్ తరహాలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ పోరాటాలకు పార్టీలకు అతీతంగా సబ్బండ వర్గాలు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు.అనంతరం ఆకునూరు గ్రామ జేఏసీ ని ఎన్నుకున్నారు.గ్రామ జేఏసీ కన్వీనర్ గా వెలుగల రఘువీర్, కో కన్వీనర్లుగా సూర రాజు, శిగుల్ల బాలరాజ్, ఎండి. అజీముద్దీన్, పెంటపర్తి లింగారెడ్డి సలహాదారులుగా విశ్రాంత ఉపాధ్యాయులు టి.వి. నారాయణ, బోయిని బాలయ్య, భూమని బాలరాజు, స్వర్గం శ్రీకాంత్, ఎండి. అహ్మద్, పోరండ్ల కృష్ణమూర్తి, తాటికొండ బాలచారి, శిగుల్ల కొమురయ్య,పందిల్ల యాదగిరి, మండేపల్లి సమ్మయ్య, ఉడుత ఐలయ్య,నాగమల్ల సాయికుమార్,ఎండి. హైమద్, కన్నెమైన శ్రీనివాస్, మెడబోయిన రాములు, జంబుల వెంకట్ రెడ్డి, కడారి మల్లయ్య,సుంచు సంజయ్,అమరగొండ నర్సింహులు, రామచంద్రం, మొత్తం 35మందిని ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీకి గ్రామస్తులు అభినందనలు తెలిపి కన్వీనర్‌ను సన్మానించారు.



బూరుగుపల్లిలో ఉచిత ఆరోగ్య శిబిరం

నవ తెలంగాణ- గజ్వేల్ : గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షులు డాక్టర్ లింగం, సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్ డీ సీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బూరుగు పల్లి గ్రామ సర్పంచ్ విజయ వర్ధన్ రెడ్డి,కార్యదర్శి,నాగరాజు, గ్రామ పంచాయితీ పాలక వర్గం, డాక్టర్స్ పెంటచారి,నరేష్ బాబు, చంద్ర రెడ్డి, సాయినాథ్ రెడ్డి,సురేష్ రెడ్డి,సంపత్,డాక్టర్ శైలజ,సుజాత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బెజ్జంకి: మండల పరిధిలోని వీరాపూర్ గ్రామానికి చెందిన చిలుముల పవన్ గత రేండు రోజుల క్రితం వరద కాలువలో జారిపడిన బాలుడిని రక్షించబోయి మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో లారీ హెల్పర్ మృతి

నవతెలంగాణ - చిన్నకోడూరు

ప్రమాదవశాత్తు 11కేవి విద్యుత్ తీగలు లారీకి తగిలి లారీ హెల్పర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండల పరిధిలోని మైలారం సబ్ స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. లారీ డ్రైవర్ అల్లా భకేష్ మరియు చిన్నకోడూరు ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలికి చెందిన ఖలీంషా సద్దాం హుస్సేన్(31) లారీ హెల్పర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఎల్లాయపల్లి గ్రామ శివారులో అనంతగిరి రిజర్వాయర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు కేబుల్ వైరును లారీలో తీసుకుని వస్తున్నారు. మైలారం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై 11కేవి విద్యుత్ వైర్లు లారీలోని కేబుల్ వైరును తాకుతుందని డ్రైవర్ భకేష్ గమనించారు. ఈ విషయాన్ని హెల్పర్లు సద్దాం హుస్సేన్, సతీష్ కుమార్‌కు చెప్పగా ఇద్దరు కిందకి దిగారు. లారీ కుడి వైపు సతీష్ కర్రతో విద్యుత్ తీగలను లేపే ప్రయత్నం చేస్తుంటే విద్యుత్ తీగలు పైకి లేవలేదు. అదే సమయంలో లారీ ఎడమ వైపు ఉన్న సద్దాం హుస్సేన్ లారీ ట్రాలీని పట్టుకొని నిల్చోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ భకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రామస్వామి కుటుంబానికి సాయం

నవ తెలంగాణ- దుబ్బాక

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట వార్డుకు చెందిన ఐలేని రామస్వామి గౌడ్ (55) కుటుంబాన్ని 9 వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి ఆదివారం పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.2 వేలు అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామస్వామిగౌడ్‌కు ఇద్దరు కూతుర్లున్నారని, వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి మానవతావాదులు ముందుకురావాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు శివరాజం గౌడ్, ఖాజీపురం దుబ్బరాజం, లోకని సత్తయ్య, దుబ్బాక వెంకటస్వామి, లోకని మల్లేశం, నారాయణ, వెంకట్ స్వామి, మల్లేశం గౌడ్ పలువురున్నారు.

కాంగ్రెస్ ఇన్చార్జి మాణిక్ ఠాగూర్‌ను కలిసిన నేతలు

నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మాణిక్ ఠాగూర్‌ను గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు జస్వంత్‌రెడ్డి కలిశారు. ఆదివారం గాంధీభవన్లో జస్వంత్ రెడ్డి తన అనుచరులతో కలిసి మాణిక్ టాగూర్తో చర్చించారు. గజ్వేల్ లో కాంగ్రెస్ పరిస్థితిని స్థానిక నేతలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త ప్రజల్లో ఉండాలని మాణిక్ ఠాగూర్ స్థానిక నేతలకు సూచించారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు కదిలించాలని పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీగిరిపల్లి కుమార్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలినపోయిన పలు అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా అభివృద్ధి చేశామంటూ మండల ప్రజలను మభ్యపెడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కాలం వెల్లదీస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పలు అభివృద్ధి పనులను మండల కాంగ్రెస్ శ్రేణులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఊర చెరువు మినీట్యాంక్ బండ్ సుందరీకరణ, మినీస్టేడియం నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రారంభించి గత కొద్ది నేలలుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయని అన్నారు. ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి హరీశ్‌రావు నిధులు విడుదల చేసిన పనులు చేపట్టడంలో అలసత్వం వహించడంలో అంతర్యమేమిటో వెల్లడించాలని, లేనిపక్షంలో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. నాయకులు శానగొండ శ్రావణ్, బోనగిరి రాజేందర్,రొడ్డ మల్లేశం, మైలప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.